# చిరంజీవి భక్తుడు

(గల్పిక)

భక్తుడికి ఇంకా ధనం కావాలి. ఉద్యోగం కావాలి. రేసులో భక్తుడు కాసే గుర్రం గెలవాలి. భక్తుడి లాటరీ టిక్కెట్టుకు మొదటి బహుమతి రావాలి. భక్తుడు తీసిన పిక్చరు హిట్ కావాలి.

మామూలు మనుషులు మనుషుల్ని నమ్ముకుంటారు. భక్తుడు దేవుణ్ణితప్ప నమ్మలేడు. ఎందుకంటే దేవుడు నీతులు చెప్పడు. దేవుడికి పెట్టే లంచం చట్ట విరుద్ధం కాదు.

దేవుడి సమక్షంలో దొంగతనం బాహాటంగా జరుగుతుంది. దేవాలయం గోడలకింద వ్యభిచారం అవిరామంగా జరుగుతుంది. దేవుడి విషయంలో మనుషుల హెచ్చు తగ్గులు ఖచ్చితంగా పాటించబడతాయి ఒక్కముక్కలో. భక్తుడికి కావలసిన జీవితం దేవుడిచుట్టూ ఉన్నది.

భక్తుణ్ణి వీలయినప్పుడల్లా దొంగలు చంపి, డబ్బు లాక్కుని, శవాన్ని ఒక మూలకు లాగిపారేస్తారు. భక్తులు ప్రయాణించే బస్సులు బోల్తాకొట్టి జననష్టం జరుగుతుంది. దేవుడు దగాచేసి భక్తుడికి తీరని ధననష్టం జరుగుతుంది. భక్తుడి కోరికలు తీరవు.

అయినా భక్తుడు చావడు, నిరుత్సాహపడడు. వాడి వంశం వర్ధిల్లుతుంది. వాడి రక్తం చిందినచోట మరింతమంది భక్తులు పుట్టుకొస్తారు.

దేవుడికి జననం లేదు. భక్తుడికి మరణం లేదు.

---

కొడవటిగంటి కుటుంబరావు